ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
తమిళనాడు
TAMILNADU
బుధవారం 6 నవంబరు 2024





విలాంగురిచ్చిలో ఎల్కాట్ ఐటీ పార్కు భవనాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

కోవైలో ఐటీ అభివృద్ధి

రూ.158.32 కోట్లతో ఎల్కాట్ పార్క్ ప్రారంభం

● 3500 మందికి ఉపాధి : సీఎం స్టాలిన్

చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యనగరమైన కోయంబత్తూరు సమీపం విలాంగురిచ్చిలో రాష్ట్ర సాంకేతిక పరిజ్ఞానం డిజిటల్ సేవలశాఖ ఆధ్వర్యంలో రూ.158.32 కోట్లతో నిర్మించిన ఎల్కాట్ ఐటీ పార్కును ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు మారుమూల ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు సీఎం స్వయంగా జిల్లాల్లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఆ మేరకు మంగళవారం కోయంబత్తూరులో క్షేత్రపరిశీలన కోసం ఆయన మంగళవారం ఉదయం చెన్నై నుంచి విమానంలో కోవై వెళ్ళారు. విమానాశ్రయం వద్ద మంత్రి సెంథిల్ బాలాజీ, డీఎంకే స్థానిక నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి విలాంగురిచ్చి ప్రాంతానికి చేరుకుని ఐటీ సెజ్‌లో నిర్మించిన ఎల్కాట్ ఐటీ పార్కును ప్రారంభించారు. ఈ ఐటీపార్కు భవనంలోని రెండంతస్థుల్లో పార్కింగ్ స్థలాలు, దిగువ, ఐదు పై అంతస్థుల్లో సమాచార సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన కార్యాలయాలు, ఎనిమిది లిఫ్టులు, అగ్నిమాపక యంత్రాల సదుపాయం, సమాచార సాంకేతిక వ్యవస్థలు, వాననీటి సేకరణ సదుపాయాలున్నాయి. ఈ ఐటీ పార్కులో పలు సంస్థలకు స్థలం కేటాయింపు పత్రాలను కూడా సీఎం అందజేశారు. ఈ ఐటీ పార్కు ద్వారా స్థానికులు సుమారు 3500 మంది ఉపాధి అవకాశాలు కలుగుతాయని స్టాలిన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, ఎంపీ సామినాథన్, వి.సెంథిల్‌బాలాజీ, పళనివేల్ త్యాగరాజన్ టీఆర్‌బీ రాజా, ఎంపీలు గణపతి పి.రాజ్‌కుమార్ కె.ఈశ్వరస్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, ప్రజాపనుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి మంగత్‌రామ్ శర్మ, సమాచార సాంకేతిక డిజిటల్ సేవల శాఖ అడిషనల్ సీఈఓ కుమార్ జయత్, టిడ్కో ఎండీ సందీప్ నందూరి, ఎల్కాట్ ఎండీ ఇరా కన్నన్, కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ పాడి ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్థలాల అప్పగింత...

కోయంబత్తూరులోని ఓ కల్యాణమండపంలో జరిగిన మరొక కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ప్రకటించిన స్థలాలను వాటి సొంత దారులకు ముఖ్యమంత్రి స్టాలిన్ అప్పగించారు. గృహనిర్మాణ సంస్థ స్థల సేకరణ చర్యలను వెనక్కి తీసుకోవడంతో కోయబంత్తూరు నార్త్, కోయంబత్తూరు సౌత్, పేరూరు జోన్ పరిధిలోని 468.89 ఎకరాల భూముల పత్రాలను ఆయనసొంత దారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు రాష్ట్ర గృహసదుపాయం నగరాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాకర్ల ఉషా, గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్ పూచ్చి ఎస్ మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

పాలనా సామర్థ్యంలో స్టాలిన్‌కు 8వ స్థానం

ఆంగ్ల పత్రిక ఇండియా టుడే పరిపాలనలో అత్యంత ప్రతిభాపాటవాలు ప్రదర్శించే 20 మంది నేతల జాబితా వెల్లడించింది. ఆ జాబితాలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు 8 వస్థానం దక్కింది. మొదటి మూడు స్థానాలు ప్రధాని మోదీ, విహెచ్‌పీ నేత మోహన్‌భగవత్, హోంమంత్రి అమిత్‌షాకు లభించాయి. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీకి 4వ స్థానం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయకుడికి ఐదో స్థానం లభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ప్రజాదరణ మెండుగా ఉందని, పార్లమెంట్‌లో 22 మంది ఎంపీలు, రాజ్యసభలో 10 మంది ఎంపీలున్నారని, వీరి గెలుపుకోసం స్టాలిన్ సమర్థవంతమైన పార్టీ నేతగా తీవ్రంగా పాటుపడి ప్రజల ప్రశంసలందుకున్నారని ఆ పత్రిక ప్రశంసించింది. రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల సమీకరణలో స్టాలిన్ అత్యంత ప్రతిభను ప్రదర్శించినట్లు పేర్కొంది.



వజ్రాల శూలాయుధంతో వళ్ళి, దేవసేన సమేతుడైన జయంతి నాథర్

వజ్ర శూలాయుధంతో మురుగన్

నలభై ఏళ్ల తరువాత భక్తులకు కలిగిన అదృష్టం

చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తిరుచెందూరు ఆలయ స్కంధ షష్టి వేడుకల్లో భాగంగా నాలుగు దశాబ్దాల తర్వాత స్వామివారు వజ్రాలు పొదిగిన శూలాయుధంతో భక్తులకు గాంభీర్యంగా దర్శనమిచ్చారు. తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయంలో స్కంధ షష్టి వేడుకలు ఈ నెల రెండున యాగశాల పూజలతో ప్రారంభమయ్యారు. ఈ వేడుకలలో కీలకఘట్టమైన శూరసంహారం ఈ నెల ఏడున అక్కడి సముద్రతీరంలో లక్షలాది మంది భక్తుల సమక్షంలో అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో స్కంధషష్ఠి వేడుకలలో నాలుగోరోజైన మంగళవారం ఉదయం యాగశాల పూజ ప్రారంభమైంది. ఆ తర్వాత ఆ చోట స్వామివారికి ప్రత్యేక దీపారాధన నిర్వహించారు. అటు పిమ్మట స్వామి జయంతినాధర్‌స్వామి తన ఇష్టదేవేరులైన వళ్ళి దేవసేన సమేతుడై స్కంధషష్ఠి మండపంలో వేంచేశారు. స్వామి, అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించిన మీద మేలి పట్టు దుస్తులు, వివిధ రకాల పుష్పాలను ధరింపజేశారు. ఆ సందర్భంగా 40 యేళ్ల తర్వాత జయంతినాధర్ స్వామివారి చేతిలో వజ్రాలు పొదిగిన స్వర్ణ శూలాయుధాన్ని ధరింపజేశారు. తళతళా మెరుస్తున్న ఆ వజ్రాల శూలాయుధాన్ని చూసిన వేలాదిమంది భక్తులు హరోంహరా మురుగయ్యా అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ తన్మయం చెందారు.



షణ్ముఖవిలాస మండపంలో స్వామివారికి దీపారాధన

9 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 9 తీర ప్రాంత జిల్లాలకు ఈ నెల 8వ తేది వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ ప్రకటించింది. ఆ ప్రకారం, చెంగల్పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, నాగపట్టణం, తిరువారూరు, తంజావూరు, రామనాధపురం, పుదుకోట తదితర 9 జిల్లాల్లో వచ్చే శుక్రవారం 6.5 సెం.మీ నుంచి 12 సెం.మీ మేర వర్షపాతం నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.





విరిగిపడిన కొండచరియలు

● తేనిలో భారీ వర్షాలు...

విరిగిపడ్డ కొండ చరియలు

స్తంభించిన రాకపోకలు

తేని జిల్లాలో రవాణా బంద్

ఊటీ - కున్నూరు కొండ రైలు రద్దు



ధ్వంసమైన రోడ్లు

అడయార్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా పెరియకుళంలోని పశ్చిమ కనుమల ప్రాంతమైన అగమలై గ్రామ పంచాయతీలో కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో పది గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న జిల్లా యంత్రాంగం కొండ చరియల శిథిలాలను తొలగించే పనుల్లో నిమగ్నమైంది. ముఖ్యంగా గ్రామ పంచాయతీ పరిధిలోని కణ్ణకరై, అలంకారం, పట్టూరు, పరంబపూర్, అన్నా నగర్, కరుంపారై, కురన్‌కుళి తదితర కొండ గ్రామాలున్నాయి. గత కొన్నాళ్లుగా ఈ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. అంతేగాక మంగళవారం ఉదయం పెరియకుళం సమీపంలో కురిసిన భారీ వర్షానికి కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా విద్యార్థులతో పాటు ఉద్యోగులు పది కిలోమీటర్ల దూరం చుట్టుతిరిగి వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఈ కొండ చరియలను జిల్లా రహదారుల అధికారులు తొలగించే చర్యల్లో నిమగ్నమైవున్నారు. అలాగే, రైలు పట్టాలపై కొండచరియలు విరిగిపడటంతో ఊటీ - కున్నూరు ప్రాంతాల మధ్య కొండ రైలు సేవలను నిలిపివేశారు. నీలగిరి జిల్లాలో ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మేట్టుపాళెయం-ఊటీ మధ్య కొండరైలు రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ఊటీ - కున్నూరు మధ్య సోమవారం పట్టాలపై కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో ఈ రెండు ప్రాంతాల మధ్య కూడా ఈ రైలు సేవలను రైల్వే అధికారులు రద్దు చేశారు.

తిరుచ్చిలో నాలుగు విద్యాసంస్థలకు బాంబు బెదిరింపు



తిరుచ్చి పాఠశాలలో తనిఖీల్లో పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణులు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చిలోని నాలుగు విద్యా సంస్థలకు బాంబు బెదిరింపు కలకలం రేపింది. తిరుచ్చి కరుమండపం, కోట, తెన్నూర్ తదితర ప్రాంతాల్లోని మూడు సీబీఎస్ఈ పాఠశాలలు, మెయిన్‌కార్డ్ గేట్ ప్రాంతంలోని మహిళా కళాశాలకు మంగళవారం ఉదయం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. ఈ విషయమై పాఠశాల నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాంబ్ స్క్వాడ్‌తో ఆయా పాఠశాలలకు చేరుకున్న పోలీసులు, పాఠశాల గదులు, ప్రాంగణాలను తనిఖీ చేశారు. ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో బెదిరింపు ఫేక్‌గా నిర్ధారించారు. బాంబు బెదిరింపులు వచ్చిన మూడు పాఠశాలలు, ఒక కళాశాలకు మంగళవారం సెలవు ప్రకటించారు. గత నెలలో ఇలాగే తిరుచ్చి నగరంలో ఈ-మెయిల్, లేఖ ద్వారా మూడు సార్లు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ-మెయిల్స్ పంపిన వారి కోసం విచారిస్తున్న నేపథ్యంలో, మళ్లీ అదే తరహాలో బెదిరింపులు రావడం నగర ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది.

తాంబరం రైల్వేస్టేషన్‌కు కూడా...

స్థానిక తాంబరం రైల్వేస్టేషన్‌కు మంగళవారం ఉదయం బాంబు బెదిరింపు వచ్చింది. నగర పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఈ బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో, పోలీసులు, బాంబ్ స్క్వాడ్, రైల్వే పోలీసులు రైల్వేస్టేషన్, ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల లగేజీ, పార్శిళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.



తాంబరం రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

మేం డీఎంకే కూటమిలోనే వుంటాం

మళ్లీ ఇలాంటి ప్రశ్నలు అడగొద్దు ● డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్



పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రానున్న 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమిలోనే డీపీఐ ఉంటుందని, ఇకపై ఎవరితో కూటమి అనే ప్రశ్నలు తనను అడగొద్దని ఆ పార్టీ అధ్యక్షుడు, ఎంపీ తిరుమావళవన్ స్పష్టం చేశారు. తిరుచ్చిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పార్టీ, కూటములకు సంబంధించి మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు. గత ఏడేళ్లుగా తాము డీఎంకే కూటమిలోనే ఉన్నామన్నారు. అలాగే, జాతీయస్థాయిలో 'ఇండియా' కూటమిలో ఉన్నామని తెలిపారు. ఈ రెండు కూటముల ఏర్పాటులో డీపీఐ పాత్ర ఉందన్నారు. ఈ కూటములను వదిలి వేరే కూటమికి వెళ్లాల్సిన అవసరం లేదని, ఈ విషయాన్ని తాము పలుమార్లు స్పష్టం చేశామని తెలిపారు. కానీ, కొందరు ఉద్దేశపూర్వకంగా డీపీఐపై అనుమానాలు రేకెత్తించే ప్రయత్నం చేస్తున్నారని, ఇలాంటి చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లోనూ డీఎంకే కూటమిలో డీపీఐ ఉంటుందని, ఈ విషయంలో ఎలాంటి సందేహాలకు తావు లేదని స్పష్టం చేశారు. డిసెంబరు 6న జరుగనున్న పుస్తకావిష్కరణలో తాను పాల్గొనడం అన్నది ఏడాది ముందే తీసుకున్న నిర్ణయమన్నారు. తొలుత ఈ పుస్తకాన్ని ఏప్రిల్ 14న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌చే ఆవిష్కరింపజేస్తామని, ఆ కార్యక్రమానికి రాహుల్ గాంధీని కూడా ఆహ్వానించనున్నట్లు నిర్వాహకులు తెలిపారన్నారు. ఈ పుస్తకంలో వ్యాసం కూడా రాయాలని వారు కోరారని, పుస్తకావిష్కరణ నిర్ణయం ఇప్పుడు తీసుకున్నది కాదన్నారు. పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించనున్నట్లు తనకు తెలియజేశారన్నారు. కొద్దివారాల క్రితం టీవీకే మహానాడుకు ముందు విజయ్‌ని కూడా ఆహ్వానించనున్నట్లు నిర్వాహకులు తెలిపారన్నారు. అలాగే, రజనీకాంత్ కూడా వస్తారని నిర్వాహకులు తెలిపారన్నారు. ఆ కార్యక్రమంలో విజయ్ పాల్గొంటారని వార్తలు వస్తున్నాయన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పార్టీ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తిరుమావళవన్ తెలిపారు.

ప్రబలుతున్న మెడ్రాస్ ఐ

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పుల కారణంగా నగరంలో 'మద్రాసు ఐ' ప్రబలుతోంది. గత నెల చివరి వారం నుంచే ఈ వ్యాధి వ్యాప్తిచెందుతోందని, బాధితులు వైద్యులను సంప్రదించి మందులు వాడాలని ఆరోగ్యశాఖ సూచిస్తోంది. కంటి వాపు, ఎర్రబడడం, కంటి నుంచి నీరు కారడం వంటివి మద్రాసు ఐ లక్షణాలు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో కండ్ల కలక కేసులు అధికమవుతుంటాయి. ప్రస్తుతం నగరంలో కురుస్తున్న వర్షాల కారణంగా కండ్ల కలక వ్యాధి వ్యాప్తిస్తోంది. ఇది సాధారణ కంటి ఇన్ఫెక్షన్ అయినప్పటికీ, ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించని పక్షంలో తీవ్రమైన సమస్యగా మారుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యాధికి గురైన వారు అధికంగా మెడికల్ షాపులకు వెళ్లి యాంటీ బయాటిక్స్ వాడుతుంటారని, కానీ తగ్గకపోవడంతో అప్పుడు ఆస్పత్రులకు వస్తున్నారని వైద్యులంటున్నారు. అలాకాకుండా కంటి వైద్యుడిని సంప్రదించి వారి సూచనల మేరకు యాంటీ బయాటిక్స్, కంటి చుక్కల మందు వినియోగించాలని వారు సూచిస్తున్నారు.

ద్రావిడ పాలనలో ఆర్య ఆధిక్యాన్ని సహించం

నటి కస్తూరిపై డీఎంకే ఎంపీ రాజా ఆగ్రహం

చెన్నై, మదురైల్లో పోలీసులకు ఫిర్యాదు

అడయార్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలను ఉద్దేశించి సినీ నటి కస్తూరి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వేడి ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. రెండు కోట్ల మందికి పైగా తెలుగు ప్రజలను కించపరుస్తూ, అవమానించేలా మాట్లాడి, వారి మనోభావాలను దెబ్బతీసిన నటి కస్తూరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎంకే ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజాతో పాటు పలు తెలుగు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. అదేసమయంలో నటి కస్తూరిపై చెన్నై, మదురై పోలీస్ కమిషనరేట్ కార్యాలయాల్లో ఫిర్యాదులు కూడా చేశారు. ఇటీవల నగరంలో జరిగిన బీజేపీ రాష్ట్ర సీనియర్ నేతలు అర్జున్ సంపత్, గురుమూర్తి కలిసి సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న నటి కస్తూరి ప్రసంగిస్తూ రాజుల వద్ద అంతఃపుర మహిళలకు సేవ చేసేందుకు తెలుగు ప్రజలు వచ్చారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. వీటిపై పెను దుమారం రేగడంతో ఆమె వివరణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ.. నిరసనజ్వాల చల్లారలేదు. ఈ విషయంపై తమిళగ నాయుడు మహాజన సంఘం ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి శృతి రమేష్, బోస్, రామమోహన రావు పాస్రై తరపున ప్రభు కలిసి మదురై పోలీస్ కమిషనర్ లోకనాథన్‌కు వినతి పత్రం సమర్పించి, కస్తూరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, సేలంలో దేశీయ తెలుంగార్ మైనార్టీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు నాగ అరవిందన్ కూడా సినీ నటిపై చర్య తీసుకోవాలని చెన్నై పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు వెల్లడించారు. నగరానికి చెందిన సంఘ సేవకురాలు వీరలక్ష్మి కూడా చెన్నై పోలీస్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేశారు. తెలుగు ప్రజల మనోభావాలను కించపరిచేలా మాట్లాడటమే కాకుండా ఎన్నో దశాబ్దాలుగా సోదరభావంతో మెలుగుతున్న తమిళ, తెలుగు ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా నటి కస్తూరి వ్యాఖ్యలు చేశారన్నారు. రెండు భాషలకు చెందిన ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేలా మాట్లాడినందుకు కస్తూరిపై కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డీఎంకే ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి ఎ.రాజా మాట్లాడుతూ.. నటి కస్తూరి కేవలం తెలుగు ప్రజలను మాత్రమే కాకుండా, మహిళలను కూడా కించపరిచేలా మాట్లాడారని, ఈ తరహా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అణగారిన వర్గాలకు చెందిన ప్రజలను నేరస్థులుగా చిత్రీకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్రావిడ పాలనలో ఆర్య ఆధిపత్యాన్ని సహించే ప్రసక్తే లేదని రాజా స్పష్టం చేశారు.

సమాచార దర్శిని

'సీఎం ఫార్మశీ'లకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా తొలివిడతగా 1,000 ప్రాంతాల్లో 'ముఖ్యమంత్రి మెడికల్స్' ఏర్పాటుకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రజలకు తక్కువ ధరకే మందులు విక్రయించేలా 1,000 ప్రాంతాల్లో సీఎం ఫార్మశీలు ఏర్పాటుచేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రకటించారు. ఆ ప్రకారం, బీ-ఫార్మ్, డీ-ఫార్మ్ చేసిన వారు మెడికల్ దుకాణాలు ప్రారంభించవచ్చు. అలాగే, ఈ కోర్సులు పూర్తిచేసి సర్టిఫికెట్ కలిగిన వారి అనుమతితో ఇతరులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి కలిగిన వారు www.mudhalvarmarun-thagam.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలి. ఎంపికైన అభ్యర్థులకు అవసరమైన శిక్షణ అందించనున్నారు. ఈ దుకాణాలు 2025 జనవరి నుంచి ప్రజలకు అందుబాటులోకి వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది.

అన్నూరు నుంచి ఊటీకి ఫోర్ వే

పెరంబూర్,నవంబరు5(ఆంధ్రజ్యోతి): అవినాశి-మేట్టుపాళయం మీదుగా 35 కి.మీ మేర నాలుగు రోడ్ల రహదారి ఏర్పాటుకానుంది. నీలగిరి జిల్లా ఊటీకి పర్యాటకుల రాక అధికమైంది. దీంతో, ఈ మార్గంలో నిరంతరం ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. ప్రస్తుతం కోయంబత్తూర్ మీదుగా మేట్టుపాళయం చేరుకొని, అక్కడి నుంచి ఊటీ వెళ్లాల్సి ఉంది. ఈ ట్రాఫిక్ సమస్య నియంత్రించేలా అవినాశి-అన్నూర్-మేట్టుపాళయం మార్గంగా 35 కి.మీ మేర నాలుగు లేన్ల రహదారికి రూ.250 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. వారంలో టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభిస్తామని రహదారుల శాఖ అధికారులు తెలిపారు.

కర్ణాటక ఆలయాలకు ప్రత్యేక ఆధ్యాత్మిక రైలు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని 12 ఆలయాల సందర్శనకు రాష్ట్రంలో నుంచి తొలిసారి ప్రత్యేక ఆధ్యాత్మిక రైలు ఏర్పాటుచేశారు. మదురై నుంచి డిసెంబరు 5వ తేది బయల్దేరే రైలు దిండుగల్, తిరుచ్చి, విరుదాచలం, విల్లుపురం, చెన్నై ఎగ్మూర్ మీదుగా కర్ణాటక వెళ్లనుంది. కర్ణాటకలోని నవ బృందావనం, హంపి, గోకర్ణ మహాబలేశ్వరుడు,మూర్తేశ్వరుడు,కొల్లూరు మూకాంబిగై, ఉడిపి శ్రీకృష్ణుడు, ధర్మస్థల మంజునాథ, మైసూరు, శ్రీరంగపట్నం, మేల్‌కోట నరసింహా సహా 12 ఆలయాలు సందర్శించవచ్చు. మొత్తం తొమ్మిది రోజుల పర్యటనకు 'ఏసీ' థర్డ్ క్లాస్ కోచ్‌లో ఒకరికి రూ.29,400, స్లీపర్ క్లాస్‌లో రూ.22,000 ఛార్జీగా నిర్ణయించారు. వివరాలకు 7305858585 అనే నెంబరు సంప్రదించవచ్చని రైల్వే అధికారులు తెలిపారు.

గ్రాండ్ మాస్టర్స్ పోటీలు ప్రారంభం

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో అన్నా సెంటినరీ లైబ్రరీలో మంగళవారం నుంచి ఈ నెల 11వ తేది వరకు గ్రాండ్ మాస్టర్స్ చెస్ ఛాంపియన్‌షిప్-2024 పోటీ లు జరుగనున్నాయి. ఈ పోటీల మొత్తం బహుమతులు రూ.70 లక్షలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది. మాస్టర్స్ విభాగంలో గెలుపొందిన వారికి రూ.15 లక్షలు, ఛాలెంజర్స్ విభాగంలో గెలుపొందిన వారికి రూ.6 లక్షల బహుమతి అందజేయనున్నారు. చెస్ అకాడమీ విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీలను ఉచితంగా వీక్షించవచ్చు. అలాగే, ఒకరికి రూ100 చెల్లించి ప్రజలు కూడా పోటీలు చూడవచ్చని నిర్వాహకులు తెలిపారు.

నేడు మణిముత్తారు డ్యాం నీటి విడుదల

వేళచ్చేరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా అంబాసముద్రం తాలూకాలోకి మణిముత్తారు డ్యాం నుంచి సాగు నీరు విడుదల చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. బుధవారం నుంచి 2025 మార్చి 31వ తేది వరకు 146 రోజులు నీటిని విడుదల చేయనున్నామని, ఈ నీటితో తిరునల్వేలి జిల్లా అంబాసముద్రం, జమీన్ సింగంపట్టి, అయన్‌సింగంపట్టి, వైరావికుళం, వెస్ట్ పాపన్‌కుళం తదితర ప్రాంతాల్లోని 2,756.62 ఎకరాలకు సాగు నీరు అందుతుందని ప్రభుత్వం తెలిపింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా నంగనల్లూర్ పరిధిలో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

నంగనల్లూర్: బీవీ నగర్, ఎంజీఆర్ రోడ్డు, కనకాంబాల్ కాలనీ, విశ్వనాథ పురం, హిందూ కాలనీ, ఎన్జీఓ కాలనీ, కేకే నగర్, టీచర్స్ కాలని, ఎస్బీఐ కాలని, ఎస్బీఐ కాలని మెయిన్ రోడ్డు, ఏజీఎస్ కాలని, దురైస్వామి గార్డన్, 100 అడుగుల రోడ్డు కొంత భాగం, సివిల్ ఏవియేషన్ కాలని, వోల్టాస్ కాలని, అయ్యప్ప నగర్, కన్నిక కాలని, లక్ష్మీ నగర్ కొంత భాగం, ఎస్బీఐ కాలని 3వ వీధి, టీఎన్జీఓ కాలని, లక్ష్మీ నగర్, జయంతి నగర్, ఉల్లాగరం, ఆళ్వార్ నగర్ 46వ వీధి, మెక్‌మిల్లన్ కాలని, పెరుమాళ్ నగర్, వేంబులి అమ్మన్ 4వ మెయిన్ రోడ్డు, జోసఫ్ వీధి, సుబ్బుస్వామి వీధి, గోవిందస్వామి వీధి, గాంధీ రోడ్డు, కుమరన్ వీధి, చర్చి రోడ్డు, కృష్ణన్‌స్వామి వీధి, మూవరసన్‌పేట కొంత భాగం, పల్లవన్‌తాంగల్ కొంత భాగం.

రేపు కమల్ జన్మదిన వేడుకలు

● ప్రజలకు సేవ చేయాలని పిలుపు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మక్కల్ నీది మయ్యం (ఎంఎన్‌ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్ గురువారం 70వ వసంతంలోకి అడుగుపెట్టనున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు ప్రజలకు సంక్షేమ సహాయాలు అందించాలని పిలుపునిచ్చారు.

హెచ్‌ఎం కోరిక మేరకు పాఠశాల తనిఖీ

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు తెలుసుకొనేలా 234/77 అనే పథకాన్ని పాఠశాల విద్యాశాఖ ప్రారంభించింది. ఆ ప్రకారం, ఆ శాఖ మంత్రి అన్బిల్ మహేష్ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలు చేసి, పాఠశాలల్లో సమస్యలు, విద్యా బోధన తదితరాలు పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో, కృష్ణగిరి జిల్లా తళి శాసనసభ నియోజకవర్గం టి.పుదూర్ పంచాయతి యూనియన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వలర్మతి తన సోషల్ మీడియాలో... మా పాఠశాలలో 33 మంది విద్యార్థులుండగా, వారందరూ తమిళం, ఆంగ్లంలో చక్కగా మాట్లాడుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు తనిఖీ చేస్తున్న మీరు, కృష్ణగిరి జిల్లాకు వస్తే మా పాఠశాలకు రవాలని మంత్రి అన్బిల్ మహేష్‌ను కోరింది. అందుకు మంత్రి, మీ పాఠశాలకు తప్పకుండా వస్తానని మెసేజ్ పంపారు. ఈ క్రమంలో, మంగళవారం ఉదయం కృష్ణగిరి జిల్లా పర్యటనకు వెళ్లిన మంత్రి అన్బిల్ మహేష్ టి.పుదూర్ పంచాయతి యూనియన్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించగా, ఆయన వారిని అభినందించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు ప్రకాష్, రామచంద్రన్, జిల్లా విద్యాధికారి (బాధ్యత) మునిరాజ్ తదితరులున్నారు.



విద్యార్థులతో మంత్రి అన్బిల్ మహేష్

పరువు నష్టం కేసు నుంచి విముక్తి కోసం ఈపీఎస్ పిటిషన్

● ఎంపీ దయానిధి మారన్ అభ్యంతరం

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పరువు నష్టం కేసు నుంచి విముక్తి కల్పించాలంటూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి దాఖలుచేసిన పిటిషన్ స్వీకరించరాదని డీఎంకే ఎంపీ దయానిధి మారన్ ప్రత్యేక కోర్టులో కౌంటర్ దాఖలుచేశారు. పురుషవాక్కంలో ఏప్రిల్ 15న పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో అన్నాడీఎంకే కూటమి తరఫున పోటీచేసిన డీఎండీకే అభ్యర్థికి మద్దతుగా పళనిస్వామి ప్రచారం చేశారు. ఆ సమయంలో, మధ్య చెన్నై నియోజకవర్గంలో డీఎంకే తరఫున పోటీచేసిన దయానిధి మారన్ తన ఎంపీ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి 75 శాతం కూడా ఖర్చుచేయలేదని విమర్శించారు. దీంతో పళనిస్వామిపై దయానిధి మారన్ పరువు నష్టం కేసు వేశారు. ఈ కేసు చెన్నైలోని ఎంపీ, ఎమ్మెల్యేలపై కేసులు విచారించే ప్రత్యేక కోర్టులో విచారణ సాగుతోంది. ఈ కేసు నుంచి తనను విముక్తి చేయాలని ఎడప్పాడి పళనిస్వామి తరఫున పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ విచారణకు అనుకూలం కాదని అభ్యంతరం వ్యక్తం చేస్తూ దయానిధి మారన్ తరఫున కౌంటర్ దాఖలుచేశారు. అందులో, కొత్త క్రిమినల్ చట్టం, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత అనే పీఎన్‌ఎస్‌ఎస్ అమలులోకి రాకముందే నేను ఈ పరువు నష్టం కేసు వేశాను. కాబట్టి పరువు నష్టం కేసు నుంచి విముక్తి కల్పించాలని కోరుతూ పీఎన్‌ఎస్‌ఎస్ చట్టం కింద పళనిస్వామి వేసిన పిటిషన్ స్వీకరించరాదని, అభియోగాలు నిందితులకు చదివి వినిపించిన దున, కేసు నుంచి విడిపించాలని కోరలేదని పిటిషన్‌లో తెలిపారు. తదనంతరం, పళనిస్వామి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనల కోసం, పరువు నష్టం కేసు విచారణ డిసెంబరు 2వ తేదీకి వాయిదావేస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జి.జయవేల్ ఉత్తర్వులు జారీచేశారు.



ఎంపీ దయానిధి మారన్, ఎడప్పాడి పళనిస్వామి

'అమ్మ' వారి వేషధారణలో మహిళ ఫిర్యాదు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడిన వారిని ప్రశ్నించడంతో, తన హత్యా బెదిరింపులు చేస్తున్నారని, వారిపై తగిన చర్యలు చేపట్టాలంటూ వలయంపట్టికి చెందిన భువనేశ్వరి అమ్మవారి వేషధారణతో నామక్కల్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించింది. ఈ విషయమై భువనేశ్వరి మాట్లాడుతూ... మోగనూరు వలయంపట్టి ముత్తరాజా వీధిలో టైలరింగ్ చేస్తూ భర్త, ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నాను. మా ప్రాంతంలో కొందరు మహిళలను హేళన చేస్తూ వారితో అసభ్యంగా ప్రవరిస్తున్నారని, నేను వారిని ప్రశ్నించానని తెలిపింది. అందుకు ప్రతీకారంగా వారు తనను, తన కుటుంబ సభ్యులను బెదిరిస్తున్నారని, ఈ విషయమై మోగనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మేము అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నాము. అందుకోసం నెలనెలా వాయిదా చెల్లించాల్సి ఉంది. ఇలాంటి సమస్యలు ఎదురై తాము ఆదాయం కోల్పోతున్నాము. ఈ విషయమై చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరినట్లు భువనేశ్వరి తెలిపింది.



అమ్మవారి వేషంలో వచ్చిన భువనేశ్వరి

రోటరీ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల

వేలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం రోటరీ జిల్లా 3231 తరఫున మహిళ బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షల కోసం అధునాతన సదుపాయాలతో కూడిన బస్సు కొనుగోలు చేయనున్నారు. ఈ వాహనం మహిళలు పనిచేసే కర్మాగారాలు, దుకాణాల వద్దకే వెళ్లి పరీక్షలు నిర్వహించి అక్కడే ఫలితాలు కూడా అందజేసేలా ఏర్పాట్లు చేశారు. అలాగే, ఈ వాహనంలో గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు కూడా చేయనున్నారు. వాహనంలో వైద్యులు, నర్సులు, సిబ్బంది అందరూ మహిళలనే నియమించను న్నారు. ఈ వాహనం కొనుగోలుకు గుడియాత్తంకు చెందిన హబీబ్ డానింగ్ యజమాని అత్తిగురు రెహ్మాన్ రూ.8.40 లక్షల చెక్‌ను రోటరీ జిల్లా మాజీ గవర్నర్ జౌరిలాల్ జైన్, పళనిలకు అందజేశారు. త్వరలో ఈ వాహనం అందుబాటులోకి వస్తుందని రోటరీ నిర్వాహకులు తెలిపారు.



రోటరీ ప్రతినిధులకు చెక్ అందజేస్తున్న రెహ్మాన్

తిరువొత్తియూరు స్కూల్ గ్యాస్ లీకేజీపై

అధికారుల్లో అయోమయం


చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరువొత్తియూరులోని విక్టరీ మెట్రిక్యులేషన్ హయ్యర్ సెకండరీ స్కూలులో పలువురు విద్యార్థినుల అస్వస్థతకు కారణమైన గ్యాస్ ఎక్కడ నుంచి లీకయిందో గుర్తించలేక అధికారులు అయోమయమవుతున్నారు. అక్టోబరు 25న ఆ పాఠశాలలో తొలిసారిగా గ్యాస్ లీక్ అయ్యింది. ఆ గ్యాస్ పీల్చిన 45 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆ సంఘటన కారణంగా వారం రోజులపాటు స్కూల్‌కు సెలవు ప్రకటించారు. సోమవారం మళ్ళీ ఆ పాఠశాలను ప్రారంభించిన అరగంటలోపే గ్యాస్ లీక్ అయి 9 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం ఉదయం నగరంలోని కాలుష్య నియంత్రణా మండలి అధికారులు కొత్త సాంకేతిక యంత్రాలున్న వ్యాన్‌తో స్కూలు వద్దకు కెళ్ళి ఆ ప్రాంతంలోని వాయు ప్రమాణాన్ని పరిశీలించారు. అయితే ఇప్పటివరకూ గ్యాస్ లీక్ కావటానికి కారణాలను కనుగొనలేకపోయారు. అదే సమయంలో ఆ గ్యాస్ ఎక్కడి నుంచి లీకవుతున్నందో తెలుసుకోలేకపోతున్నారు. ఈ విషయమై కార్పొరేషన్ జోనల్ కమిటీ నేత తనియరసు మాట్లాడుతూ కాలుష్యనియంత్రణా మండలి, జిల్లా విద్యాశాఖ అధికారుల నుంచి ఎలాంటి అనుమతి తీసుకోకుండా పాఠశాల తెరవటం వల్లే గ్యాస్ లీకై 9 మంది విద్యార్థినులు అస్వస్థత చెందారని తెలిపారు. ఈ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎలాంటి ముప్పువాటిల్లకుండా చర్యలు చేపట్టాలని పాఠశాల యాజమాన్యానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణా మండలి అధికారులు మూడు రోజుల పాటు ఆ స్కూలు వద్ద పరిశోధన చేస్తామని చెప్పారు. వాటి ఫలితాలు వచ్చాకే స్కూల్ తెరవటమా వద్దా అనే విషయంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుంటారని తనియరసు చెప్పారు.



స్కూలు వద్ద ఉన్న కాలుష్య నియంత్రణ మండలి వ్యాన్

కుమారుడి మృతి తట్టుకోలేక దంపతుల ఆత్మహత్య

చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్లారు ముద్దుగా పెంచిన ఏడేళ్ల కుమారుడి మృతిని తట్టుకోలేక ఐదుమాసాలుగా తీరని దిగులతో బాధపడుడిన దంపతులు కోవై లాడ్జీలో విషం తాగి ఆత్మహత్యచేసుకున్నారు. శివకాశి సమీపం పూలావురిని ప్రాంతంలో పళనిసామి (39), వత్సల (35) అనే దంపతులు నివసిస్తున్నారు. వీరి ఏడేళ్ల కుమారుడు గత ఏప్రిల్‌లో మెదడు వాపు వ్యాధితో మృతి చెందటంతో కుమిలిపోయారు. పుత్రశోకంతో ఉన్న ఆ దంపతులకు కోయంబత్తూరులో ఉన్న ఓ బంధువు ఇంట తాత్కాలిక బస కల్పించారు. చోటు మారినా ఆ దంపతులు పుత్ర శోకం నుండి బయటపడలేకపోయారు. సోమవారం ఉదయం పళనిసామి, వత్సల కోయంబత్తూరు గాంధీపురం కాట్టూరు ప్రాంతంలో ఉన్న లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నారు. రాత్రి వారిద్దరూ విషం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం ఉదయం గది నుంచి అలికిడి రాకపోవటంతో లాడ్జి నిర్వాహకులు గదిని తెరచి చూడగా ఆ దంపతులు నోటిలో నురగలు కక్కుకుని శవాలుగా పడి ఉన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టంకు పంపారు. ఆ మృతదేహాల పక్కన ఉన్న ఓ లేఖను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖలో తమ మరణానికి ఎవరూ కారణం కాదని, కుమారుడి మృతిని తట్టుకోలేకే ఆత్మహత్య చేసుకున్నామని ఆ దంపతులు రాసి ఉంచారని పోలీసులు తెలిపారు.



పళనిస్వామి, వత్సల (ఫైల్‌ఫొటో)

పుచ్చకాయ, కిరణి పండ్ల సాగుకు చర్యలు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంబా సాగు అనంతరం రైతులు పుచ్చకాయలు, కిరిణి పండ్లు సాగుచేసేలా ఉద్యానవన శాఖ అవగాహన కల్పించనుంది. తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం తదితర డెల్టా జిల్లాల్లో సుమారు 13 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. అలాగే, ఇతర జిల్లాలతో కలిపి మొత్తం 30 లక్షల ఎకరాల్లో సాంబా సాగు జరుగుతోంది. జనవరిలో వరి కోత ముగిసిన తర్వాత రైతులు కొంతకాలం వ్యవసాయ పనులు చేపట్టడం లేదు. ఆ సమయంలో పుచ్చకాయలు, కిరిణి పండ్లు, కీర దోస తదితరాలు సాగుచేయాలని ఉద్యానవన శాఖ రైతులకు సూచిస్తోంది. ఈ పంటకు తక్కువ నీరు మాత్రమే కావాల్సి ఉండడంతో రైతులు సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అదే సమయంలో ఈ పంటలు సాగుచేసే రైతులకు ఎకరాకు రూ.4,000 సబ్సిడీ ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

రూ.100 అద్దెతో కార్యాలయం: సీఎండీఏ

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొళత్తూర్‌లో సోమవారం సీఎం ప్రారంభించిన 'కో వర్కింగ్ స్పేస్'ను రూ.100 అద్దెతో వినియోగించుకోవచ్చని సీఎండీఏ తెలిపింది. ఈ భవనంలోని విద్యా కేంద్రాన్ని పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఒకరికి రెండున్నర గంటలకు రూ.5 చెల్లించాలి. 'షేర్డ్ వర్క్ స్పేస్' వినియోగించుకొనేందుకు ఒక వ్యక్తికి సగం రోజుకు రూ.50, పూర్తి రోజుకు రూ.100, నెలకు రూ.2,500గా నిర్ణయించారు. అలాగే, మీటింగ్ హాల్ వినియోగానికి నాలుగు సీట్లకు గంటకు రూ.150, ఆరు సీట్లకు రూ.250 ఫీజుగా నిర్ణయించారు. అందుకు ముందస్తు రిజర్వేషన్లకు https://gccser-vices.chennicorporat-ion.gov.in/muthalvarpadaippagam అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవచ్చని సీఎండీఏ ఒక ప్రకటనలో తెలిపింది.

తాబేళ్ల గుడ్ల సంరక్షణకు రూ.35 లక్షలు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాబేళ్ల గుడ్ల సంక్షణకారుల ప్రమేయాన్ని అనుమతిస్తూ, తాబేళ్ల గుడ్ల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 లక్షలు కేటాయించింది. జూన్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అప్పటి అటవీ శాఖ మంత్రి మదివేందన్, తాబేళ్ల సంరక్షణకారులను నియమించి వాటిని సంరక్షించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలోని తీరప్రాంతాలకు ప్రతి ఏటా ఆలివ్ రెడ్లీ, ఆకుపచ్చ తాబేళ్లు వచ్చి ఇసుకలో గుడ్లు పెట్టి తిరిగి సముద్రంలోకి వెళ్తుంటాయి. ఈ గుడ్లను పక్షులు, నక్కలు తింటుడడంతో అరుదైన ఈ తాబేళ్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. దీన్ని అరికట్టేలా అటవీ శాఖ సిబ్బంది జాలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలసి తాబేళ్ల గుడ్లు సేకరించి ప్రత్యేక స్థలంలో పొదిగించి, పిల్లలు వచ్చిన తర్వాత సముద్రంలోకి వదిలిపెడుతుంటారు. ఈ క్రమంలో, తాబేళ్ల సంరక్షణకారుల ప్రమేయాన్ని అనుమతిస్తూ, వాటి సంరక్షణకు రూ.35 లక్షలు కేటాయిస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో విడుదల చేసింది.

వ్యాయామ శాలకు భూమి పూజ

వేలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆనైకట్టు నియోజకవర్గం వరదలాంపట్టు పంచాయతీలో కొత్తగా వ్యాయామ శాల ఏర్పాటుకానుంది. స్థానిక ఎమ్మెల్యే సలహా మేరకు జిల్లా పంచాయతీల కమిటీ అధ్యక్షుడు బాబు కొత్త వ్యాయామ శాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆనైకట్టు యూనియన్ ఉప సెక్రటరీ గణపతి, వరదలాంపట్టు యూనియన్ కమిటీ సభ్యుడు రాము, శాఖ సెక్రటరీ శివరాజ్, అమీర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



భూమి పూజలో యూనియన్ సెక్రటరీ బాబు

ది ఐ ఫౌండేషన్ ఆస్పత్రి 23వ శాఖ ప్రారంభం

వేలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరుదంబట్టులో ది ఐ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి 23వ శాఖ ప్రారంభమైంది. అధునాతన లేజర్ చికిత్స కంటి శుక్లం శస్త్రచికిత్స సహా పలు కంటి సంబంధిత సేవలను ఈ ఆస్పత్రిలో రెండు నెలలు ఉచితంగా చేస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు డా.రామమూర్తి తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహణ డైరెక్టర్ సిరోయాస్, డా.మాధవి, జనరల్ మేనేజర్లు ఉలగనాథన్, కృష్ణకుమార్ సహా పలువురు పాల్గొన్నారు.



ఆస్పత్రి ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

అభివృద్ధి పనుల పరిశీలన



డెంగ్యూ నిర్మూలన చర్యలు పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక 10వ వార్డు పరిధిలోని గోపాలపురంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. తొలుత కలిస్‌జార్ రోడ్డు వెంకటేశన్ నగర్‌లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణం, ధారాపడవీడులో రూ.75 లక్షలతో చేపట్టిన నగర ప్రాంత ఆరోగ్య కేంద్రం నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కులకరై వీధిలో డెంగ్యూ నిర్మూలన చర్యలను కలెక్టర్ పరిశీలించి, అధికారులకు సూచనలు అందించారు. కలెక్టర్ వెంట కార్పొరేషన్ కమిషనర్ జానకి రవీంద్రన్, పలు శాఖ అధికారులున్నారు.

ట్రాఫిక్ ఎస్‌ఐని చెప్పుతో కొట్టిన మహిళ

● ముగ్గురి అరెస్టు

అడయార్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న ట్రాఫిక్ ఎస్‌ఐని చెప్పుతో కొట్టిన మహిళ సహా మరో ఇద్దరిని సేలం పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. సేలం జిల్లా శూరామంగళం ప్రాంతానికి చెందిన కార్తీక్ (43), ఈయన సోదరి కమలేశ్వరి (35), వీరి బంధువు మురళీకృష్ణన్ (28) కలిసి కారులో సేలం కొత్త బస్టాండుకు సోమవారం సాయంత్రం వెళ్ళారు. ఆ సమయంలో ట్రాఫిక్ అధికంగా ఉండటంతో కారును మరోచోట పార్కింగ్ చేసుకోవాలని విధుల్లో ఉన్న స్పెషల్ ఎస్‌ఐ శరవణవేలన్ సూచించారు. దీంతో వారు కారు తీసుకెళ్తుండగా, ట్రాఫిక్ పోలీసులు ఆపి తనిఖీ చేయడంతో ఆగ్రహించిన కమలేశ్వరి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో ఆగ్రహించిన కమలేశ్వరి చెప్పు తీసుకుని ఎస్‌ఐను కొట్టడంతో మిగిలిన పోలీసులంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఆ వెంటనే ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని మొత్తం ఆరు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

రైలు ఢీకొని వృద్ధ దంపతుల మృతి

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మరైమలైనగర్‌లో రైలు ఢీకొని వృద్ధ దంపతులు మృతిచెందారు. చెంగల్పట్టు జిల్లా మరైమలై రైల్ నగర్‌కు చెందిన సెంథిల్‌వేలన్ (65) భార్య పసుమ్‌పొన్ (59)తో కలసి రామేశ్వరం వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం చెన్నై ఎగ్మూర్ వెళ్లి అక్కడి నుంచి రైలులో రామేశ్వరం వెళ్లేలా ప్రయాణం సిద్ధం చేసుకున్నారు. అందుకోసం వారిద్దరూ మరమలైనగర్ రైల్వేస్టేషన్ వెళ్లేందుకు రైలుపట్టాలు దాటుతున్న సమయంలో ఎగ్మూర్ నుంచి తిరుచ్చి వెళుతున్న రైలు ఢీకొంది. ఈ ఘటనలో వృద్ధ దంపతులు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు.

13న ఓపీఎస్ సోదరుడి కేసు తీర్పు

పెరంబూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పూజారిని ఆత్మహత్యకు ప్రేరేపించడంటూ మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం సోదరుడు ఓ.రాజా సహా ఆరుగురిపై కేసు నమోదైంది. ఈ కేసు దిండుగల్ కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో, మంగళవారం ప్రభుత్వ న్యాయవాది తుది వాదన వినిపించారు. ప్రభుత్వ వాదనల అనంతం ఈ కేసు తీర్పును ఈ నెల 13కి కోర్టు వాయిదావేసింది. ఈ రోజు ఓ.రాజా సహా ఆరుగురు, ప్రభుత్వ, ప్రత్యర్థి తరపు న్యాయవాదులు హాజరుకావాలని కోర్టు ఆదేశించింది.

రాష్ట్ర జాలర్ల శిక్షాకాలం తగ్గింపు

వేళచ్చేరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సరిహద్దులు దాటి చేపల వేట చేస్తున్నారంటూ తిరునల్వేలికి చెందిన 28 మంది జాలర్లను సెప్టెంబరు 11న బహ్రెయిన్ నావికాదళం అరెస్ట్ చేసింది. ఈ జాలర్లకు 6 నెలల జైలు శిక్ష విధిస్తూ ఆ దేశ న్యాయస్థానం తీర్పు చెప్పడంతో వారిని బహ్రెయిన్ జైలులో ఉంచారు. ఈ విషయమై కేంద్ర విదేశాంగ మంత్రికి రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ లేఖ రాసిన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలతో జాలర్లకు విధించిన 6 నెలల శిక్షను 3 నెలలకు తగ్గించినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

విద్యార్థినిని రక్షించిన కానిస్టేబుల్

వేళచ్చేరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటేందుకు యత్నించే సమయంలో లారీ కింద పడిబోయిన పాఠశాల విద్యార్థినిని రక్షించిన కానిస్టేబుల్‌ను పలువురు అభినందించారు. కోవై జిల్లా సూలూరు సమీపం కలంగల్ నాలుగు రోడ్ల జంక్షన్ ప్రాంతంలో ఓ విద్యార్థినిని రోడ్డు దాటేందుకు యత్నించింది. ఆ సమయంలో వచ్చిన లారీని విద్యార్థిని గమనించలేదు. విద్యార్థిని లారీకి దగ్గరవడాన్ని గమనించిన సాయుధదళ కానిస్టేబుల్ సెల్వగణేశ్ పరుగునవెళ్లి విద్యార్థినిని పక్కకు లాగాడు. అదే సమయంలో లారీ డ్రైవర్ కూడా విద్యార్థిని గమనించి సడన్ బ్రేక్ వేయడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.



విద్యార్థినిని రక్షిస్తున్న పోలీసు సెల్వగణేశ్

జైలుపాలైన అర్చకుడు

అడయార్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా తిరుపుల్లాణియిల్ ప్రాంతంలోని జగన్నాథ పెరుమాళ్ ఆలయంలో రూ.కోటి విలువ చేసే బంగారు నగలు మాయమైన కేసులో శ్రీనివాసన్ అనే అర్చకుడిని జైలుకు తరలించారు. ఈ నగల మాయం కేసులో మార్చి 30వ తేదీ కేసు నమోదు కాగా, అర్చకుడు కింది కోర్టు నుంచి మద్రాస్ హైకోర్టు వరకు ముందస్తు బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అయితే, కోర్టులు ఆయన పిటిషన్లను తోసిపుచ్చడంతో పోలీసులు శ్రీనివాసన్‌ను అరెస్టు చేసి, రామనాథపురం జిల్లా కోర్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి ఆ తర్వాత జిల్లా జైలుకు తరలించారు.

ఆమ్నీ బస్సుకు రూ.10 లక్షల జరిమానా

వేళచ్చేరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి మదురైకి నకిలీ పర్మిట్‌తో వచ్చిన ఆమ్నీ బస్సుకు రవాణా శాఖ అధికారులు రూ.10 లక్షల జరిమానా విధించారు. దిండుగల్ జిల్లా కొడైరోడ్డు టోల్‌గేట్ మార్గంగా పలు జిల్లాలు, పొరుగు రాష్ట్రాల నుంచి ఆమ్నీ బస్సులు మదురై సహా పలు ప్రాంతాలకు వెళ్లుంటాయి. అలా వెళ్లే ఆమ్నీ బస్సులకు సరైన పర్మిట్లు ఉండవనే ఆరోపణలున్నాయి. దీంతో, సోమవారం ఉదయం రవాణా శాఖ ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి శివకుమార్ నేతృత్వంలో తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో హైదరాబాద్ నుంచి మదురై వచ్చిన ఆమ్నీ బస్సును ఆపారు. బస్సు పత్రాలు తనిఖీచేయగా, 2016 నుంచి అందులో ప్యాసింజర్ సీట్లు లేవని చూపుతూ నకిలీ సిట్టింగ్ సీట్లు వినియోగిస్తున్నారని, రోడ్డు పన్ను కూడా సక్రమంగా చెల్లించలేదని తెలియడంతో, రూ.10 లక్షల జరిమానా విధించిన అధికారులు బస్సును సీజ్ చేశారు. అందులోని ప్రయాణికులను ఇతర బస్సుల్లో పంపించారు.

జవ్వాదు కొండల్లో విరిగిపడిన మట్టిచరియలు

వేళచ్చేరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూర్ జిల్లా జవ్వాదు కొండల్లో ఆదివారం అర్ధరాత్రి హఠాత్తుగా భారీవర్షం కురిసింది. దీంతో, తిరుపత్తూర్ నుంచి 46 కి.మీ దూరంలో ఉన్న కావలూరు వరకు 20 ప్రాంతాల్లో మట్టిచెరియలు విరిగిపడడంతో పుదూర్‌నాడు, వడుతలంబేడు, నెల్లివాసల్‌నాడు, కుంబుకుడి నాడు సహా 20 కొండ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దీంతో, రహదారుల శాఖ అధికారులు మట్టిచరియలు తొలగించే పనులు చేపట్టారు. బుధవారం నుంచి ఈ మార్గంలో వాహన రాకపోకలు జరుగుతాయని అధికారులు తెలిపారు.


పీక్ అవర్స్‌లో వాహనతనిఖీలు తీవ్రతరం

● పోలీస్ కమిషనర్ అరుణ్

వేళచ్చేరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో పీక్ అవర్స్‌లో తనిఖీలు తీవ్రతరం చేయాలని గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ అరుణ్ ఆదేశించారు. ఉదయం 9 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు వాహనతనిఖీల్లో సహాయ కమిషన్లు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొనాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల అక్రమ తరలింపు, సెల్‌ఫోన్, చైన్ స్నాచింగ్, రౌడీల కదలికలు పర్యవేక్షించేలా ఈ తనిఖీలు చేపడుతున్నట్లు నగర పోలీసు శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

సన్‌భీమ్ పాఠశాలలో కల్చరల్ ఫెస్ట్

వేలూరు, నవంబరు5(ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి సన్‌భీమ్ పాఠశాలలో మంగళవారం కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. కార్యక్రమంలో డా.వెట్రివేల్ కమిటీ టీఎన్‌ఎస్సీ గౌరవాధ్యక్షుడు, వేలూరు, చెన్నై, వాలాజా సన్ భీమ్ పాఠశాలల కరస్పాండెంట్ హరిగోపాలన్, డా.అబూత్‌హసన్, అధ్యక్షుడు ఐఎంఏ టీఎన్‌ఎస్సీ డా.కార్తీక్ ప్రభు, రాష్ట్ర సెక్రటరీ గౌరి శంకర్, గౌరవ నిధుల సెక్రటరీ కోసలరామ్, వేలూరు ఐఎంఏ దక్షిణ మండల ఆర్గనైజర్ మణికంఠన్ తదితరులు పాల్గొన్నారు.



కల్చరల్ ఫెస్ట్‌లో మహిళలు

చిత్రజ్యోతి



'అమరన్' సక్సెస్ మీట్‌లో శివకార్తికేయన్, రాజ్‌కుమార్, జీవీ ప్రకాష్

'అమరన్' కమర్షియల్ సక్సెస్ ఎంతో ముఖ్యం

● శివకార్తికేయన్

'అమరన్' మూవీ కమర్షియల్‌గా విజయం సాధించడం తనకు ఎంతో ముఖ్యమని హీరో శివకార్తికేయన్ (ఎస్కే) అన్నారు. దీపావళి పండుగ సందర్భంగా పాన్ ఇండియా మూవీగా విడుదలైన ఈ చిత్రం అన్ని భాషల్లో ఘన విజయాన్ని సొంతం చేసుకుని, హౌస్‌ఫుల్ కలెక్షన్లతో ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి 'అమరన్ సెలెబ్రేషన్స్' పేరుతో సక్సెస్ వేడుకలను నగరంలో నిర్వహించారు. ఇందులో హీరో ఎస్కే, హీరోయిన్ సాయిపల్లవి, దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్, సహ నిర్మాత మహేంద్రన్ తదితరులు పాల్గొన్నారు. దర్శకుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ, 'దేశం కోసం ప్రాణాలర్పించిన మేజర్ ముకుంద్ వరదరాజన్ రియల్ హీరో. ఆయన జీవించివున్నపుడు కూడా తాను ఒక సామాజికవర్గానికి చెందిన వ్యక్తిగా చెప్పుకునేందుకు ఇష్టపడలేదు. భారత సైనికుడిగానే ఉండిపోవాలన్నది అతని కోరిక. ఇదే విషయాన్ని ముకుంద్ తల్లిదండ్రులు కూడా చెప్పారు. ఆ కారణంగానే ఆయన ఏ వర్గానికి చెందిన వ్యక్తో సినిమాలో చెప్పలేదన్నారు. హీరోయిన్ సాయిపల్లవి మాట్లాడుతూ, 'ఇప్పటివరకు ఎన్నో పాత్రలు చేశాను. కానీ, ఒక అద్భుతమైన చిత్రంలో నటించే అవకాశం కల్పించిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలన్నారు. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ, 'ఈ దీపావళి నాకు ఎంతో స్పెషల్. నేను సంగీతం సమకూర్చిన 'అమరన్' (తమిళం), 'లక్కీభాస్కర్' (తెలుగు) సూపర్ హిట్ సాధించాయి' అన్నారు. హీరో శివకార్తికేయన్ మాట్లాడుతూ, 'ఈ చిత్రం ఇప్పటికే రూ.150 కోట్ల కలెక్షన్లు రాబట్టింది. ఇంత బ్లాక్‌బస్టర్ హిట్ చేసిన మీడియా, ప్రేక్షక దేవుళ్ళకు ధన్యవాదాలు. 'అమరన్' వంటి ఒక కమర్షియల్ హిట్ ఇపుడు నాకు ఎంతో ముఖ్యం. నా మార్కెట్ ఎంతో నిర్మాతలు తెలుసుకుని, అందుకు అనుగుణంగా భారీ బడ్జెట్ చిత్రాలు నిర్మించేందుకు అవకాశం లభిస్తుంది. తమిళ చిత్రపరిశ్రమ నాకంటూ ఓ స్థానం ఇచ్చింది. దాన్ని కాపాడుకునేందుకు అహర్నిశలు కృషి చేస్తా. ఈ దఫా 'అమరన్' కంటే భారీ హిట్ కొట్టాలన్నది నా సంకల్పం. ముకుంద్ వరదరాజన్‌కు తన తండ్రి దాస్‌కు మధ్య అనేక సారూప్యత లున్నాయి. వారిద్దరిలో ఒకరు ఆర్మీలో ప్రాణాలు కోల్పోతే, నా తండ్రి రాష్ట్ర జైళ్ళ శాఖలో పనిచేస్తూ చనిపోయారు. అపుడు నాకు 17 యేళ్ళు. నా గమ్యం ఏంటో తెలియని వయసు. ఆ రోజు మా నాన్న శవాన్ని దహనం చేసిన తర్వాత చిన్న చిన్న ఎముకలు లభించాయి. అవి ఎముకలు కాదు. ముక్కలైన నా హృదయం. నాన్న మా మధ్య భౌతికంగా లేకపోయినప్పటికీ ఆయన జ్ఞాపకాలతోనే జీవిస్తున్నాం. మీ అందరి ఆశీర్వాద బలంతో ఈ రోజు నేను ఈ స్థాయిలో ఉన్నాను' అంటూ ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.

'బెంజ్' సంగీత దర్శకుడిగా సాయి అభయంకర్



దర్శకుడు లోకేష్ కనకరాజ్ నిర్మాతగా రాఘవ లారెన్స్ హీరోగా రూపొందే 'బెంజ్' చిత్రానికి సంగీత దర్శకుడుగా సాయి అభయంకర్‌కు అవకాశం వరించింది. ఈయన 'కట్చి సేరా', 'ఆశ కూడా' అనే ప్రైవేట్ ఆల్బమ్స్ ద్వారా గుర్తింపు పొందారు. సంగీతంపై ఎనలేని అభిరుచి, ప్రేమ ఉన్నవారు చిత్రపరిశ్రమలో తిరుగులేని శక్తిగా రాణిస్తున్నారు. అలా రాత్రికి రాత్రి వెలుగులోకి వచ్చిన యువ సంగీత దర్శకుడే సాయి అభయంకర్. ఇపుడు 'బెంజ్' చిత్రం ద్వారా వెండితెరకు పరిచయంకానున్నారు. ఈ సినిమాకు 'రెమో', 'సుల్తాన్' వంటి హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించిన భాగ్యరాజ్ కన్నన్ డైరెక్ట్ చేస్తున్నారు. రాఘవ లారెన్స్ చిత్రానికి సంగీత స్వరాలు సమకూర్చే అవకాశం రావడంపై సాయి అభయంకర్ మాట్లాడుతూ, 'ఇంతకంటే మంచి డెబ్యూను ఊహించలేదు. ఈ తరుణంలో ఉత్సాహంతో పాటు నా బాధ్యత కూడా గుర్తుకు వస్తుంది. ఈ గొప్ప అవకాశాన్ని ఇచ్చిన ప్యాషన్ స్టూడియోస్ అధినేత సుధన్ సుందరం, లోకేష్ కనకరాజ్, జగదీష్ పళనిస్వామిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతున్నాను. అభిమానుల్లో భారీ అంచనాలున్న 'బెంజ్' చిత్రానికి సంగీత సమకూర్చే అవకాశం రావడం గొప్పగా భావిస్తున్నాను. లోకేష్ కనకరాజ్ యూనివర్శల్ చిత్రాలకు నేను వీరాభిమానిని. 'బెంజ్' చిత్రానికి అత్యుత్తమ సంగీతాన్ని అందించేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నాను' అని పేర్కొన్నారు.

చెన్నైలో 'విజయ్ 69' రెండో షెడ్యూల్



పూజా హెగ్డే - విజయ్

హెచ్.వినోద్ దర్శకత్వంలో అగ్ర హీరో విజయ్ నటిస్తున్న 'విజయ్ 69' (వర్కింగ్ టైటిల్) రెండో షెడ్యూల్ చెన్నై నగరంలో ప్రారంభమైంది. ఇందులో సినిమాలోని అతి ముఖ్యమైన కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. 'ది గోట్' వంటి బ్లాక్ బస్టర్ హిట్ చిత్రం ద్వారా విజయ్ నటిస్తున్న చిత్రం కావడంతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా పూజా కార్యక్రమం అక్టోబరు 4వ తేదీ చెన్నైలో ప్రారంభం కాగా అదే రోజు ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో ఓ పాట చిత్రీకరించారు. ఆ తర్వాత షూటింగ్‌కు బ్రేక్ ఇచ్చిన విజయ్... తన సొంత పార్టీ తమిళగ వెట్రి కళగం తొలి మహానాడులో పాల్గొన్నారు. దీపావళి తర్వాత రెండో షెడ్యూల్ ప్రారంభించారు. వచ్చే యేడాది అక్టోబరులో విడుదల చేయనున్నట్టు ప్రకటించిన విషయం తెల్సిందే. ఇందులో హీరోయిన్‌గా పూజా హెగ్డే, మమితా బైజు, బాబీ డియోల్, గౌతం వాసుదేవ్ మేనన్, నరేన్, ప్రకాష్ రాజ్, ప్రియమణి తదితరులు నటిస్తున్నారు. అనిరుధ్ సంగీతం. కేవీఎన్ ప్రొడక్షన్ పతాకంపై నిర్మాత వెంకట్ కె.నారాయణ, సహ నిర్మాతలు జగదీష్ పళనిస్వామి, లోహిత్ ఎన్కే కలిసి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

ఖాకీ యూనిఫాంపై ప్రత్యేకమైన ప్రేమ

● హీరో నకుల్

బాల్యం నుంచే తనకు ఖాకీ యూనిఫాంపై ప్రత్యేకమైన ప్రేమ ఉందని హీరో నకుల్ అన్నారు. ఆయన పోలీస్ ఆఫీసర్‌గా నటించిన తాజా చిత్రం 'ది డార్క్ హెవెన్'. బాలాజీ దర్శకుడు. ఈయన గతంలో 'డీ3' అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. గోడై ఎంటర్‌టైన్మెంట్, ఎంఎస్ మీడియా ఫ్యాక్టరీ సంయుక్తంగా నిర్మించాయి. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ రిలీజ్ వేడుక నగరంలో సోమవారం జరిగింది. ఇందులో దర్శక హీరోలతో పాటు చిత్ర బృందం పాల్గొంది. దర్శకుడు బాలాజీ మాట్లాడుతూ, 'ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను సీనియర్ నటుడు శశికుమార్ రిలీజ్ చేశారు. నేను డైరెక్ట్ చేసిన తొలి చిత్రం ఫస్ట్‌లుక్ కూడా ఆయనే రిలీజ్ చేశారు. ఈ సినిమా బాగా వచ్చింది. హీరో నకుల్‌కు మంచి పేరు వస్తుంది. ఇందులో నటుడు అలెక్స్ మరో ముఖ్యపాత్ర పోషించారు. మూడు పీరియడ్లలో మూడు గెటప్‌ల్లో కనిపిస్తారు. ఇందుకోసం నకుల్ తన శరీరాన్ని ఎంతో శ్రమించి మార్చుకున్నారు. ఇప్పటివరకు అనేక పాత్రల్లో నకుల్‌ను చూశాం. కానీ, ఇప్పటివరకు చూడని పాత్రలో ఈ సినిమాలో కనిపిస్తారని పేర్కొన్నారు. హీరో నకుల్ మాట్లాడుతూ, 'పోలీస్ పాత్రలకు ప్రత్యేకమైన గుర్తింపు తీసుకొచ్చిన నటులు కమల్ హాసన్, విక్రమ్, సూర్య. ఇపుడు అలాంటి పాత్ర చేయాల్సి రావడంతో నేను భయానికి లోనయ్యా. బాల్యం నుంచి ఖాకీ యూనిఫాంపై ప్రేమ ఉన్నప్పటికీ ఆ దుస్తులు ధరించగానే తెలియని భయంతో పాటు గర్వం కూడా వచ్చేసింది. పోలీస్ పాత్రలో నటించడం ఎంతో గర్వంగా ఫీలవుతున్నాను. పోలీస్ శాఖ చేసే అనేక మంచి పనులు ఈ చిత్రంలో చూపించాం' అని పేర్కొన్నారు.



మీడియా సమావేశంలో చిత్ర బృందం

పోలీస్ గ్రీవెన్స్‌లో 282 వినతులు



సమస్యలు తెలుసుకుంటున్న పోలీస్ కమిషనర్ అరుణ్

వేళచ్చేరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగర పోలీసు శాఖ ఈస్ట్ జోన్ పరిధిలో మధ్య వెప్పేరి పోలీస్ స్టేషన్‌లో 'పోలీసుల సమస్యల పరిష్కార శిబిరం' మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అరుణ్ పాల్గొని 282 మంది నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. బదిలీ, క్వార్టర్స్ కేటాయింపు, వేతనాలకు సంబంధించిన సమస్యలను పోలీసులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను కమిషనర్ అరుణ్ ఆదేశించారు.

అత్యాధునిక ఫీచర్లతో ఇంపెక్స్ ఆండ్రాయిడ్ 14 క్యూలెడ్ టీవీ



టీవీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

అడయార్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక ఫీచర్లతో ఇంపెక్స్ ఆండ్రాయిడ్ 14 క్యూలెడ్ టీవీని ఆవిష్కరించారు. ఇందులో ఏఎల్ఎల్ఎం, హెచ్‌డీఎంఐ డిస్క్‌తో పాటు అబ్బురపరిచే గేమింగ్ ఫీచర్లున్నాయి. ప్రీమియం సెగ్మెంట్ కస్టమర్లను లక్ష్యంగా పెట్టుకుని ఈ యేడాది మూడో త్రైమాసికంలో క్వాంటమ్ డాట్ మినీ లెడ్ సిరీస్ పేరుతో ఈ టీవీలను మార్కెట్‌లోకి తీసుకురానుంది. ఈ టీవీలు 55, 65 అంగుళాల సైజుల్లో లభ్యంకానున్నాయి. కేరళ రాష్ట్రంలో టెలివిజన్ బ్రాండ్ల అమ్మకాల్లో మూడో అతిపెద్ద నెట్‌వర్క్‌గా ఉందని ఇంపెక్స్ మేనేజింగ్ డైరెక్టర్ నువైస్.సి వెల్లడించారు. ఆయన మంగళవారం నగరంలో మీడియాతో మాట్లాడుతూ, మేక్ ఇన్ ఇండియా ఆవిష్కరణల్లో భాగంగా కేటరింగ్ అప్లైయెన్సెస్, లైఫ్‌స్టైల్, హోం అండ్ కిచెన్ ఉత్పత్తులపై దృష్టిసారించినట్టు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని చామరాజనగర్‌లో తమ ప్లాంట్ ఉందన్నారు. తాజాగా ప్రవేశపెట్టిన టీవీ థియేటర్ అనుభూతినిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్య ఏజెన్సీస్ మేనేజింగ్ డైరెక్టర్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.





ఏకాంబరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలు పోస్తున్న భక్తులు - శివలింగానికి పూజలు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

వేళచ్చేరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ రామ్ నగర్‌లోని పురాతన నాగ దేవత ఆలయంలో మంగళవారం నాగుల చవితి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఆలయంలో ప్రతి ఏటా నాగుల చవితిని ఏడు రోజులు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది వేడుకల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అందులో భాగంగా ఈ నెల 1వ తేది ధ్వజారోహణం, అమ్మవారి ప్రత్యేక అలంకరణ జరిగాయి. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరో వీధిలో ఉన్న మాతమ్మ ఆలయం నుంచి చిన్నారులు, మహిళలు పాలబిందెలతో మేళతాళాల నడుమ నాలుగో వీధిలో ఉన్న నాగదేవత ఆలయానికి ఊరేగింపుగా వచ్చారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ నాగదేవత విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ వేడుకల్లో తెలుగు ప్రజలంతా ఉత్సాహంగా ఆలయానికి వచ్చి పాటలు పాడుతూ నాట్యం చేశారు. ఆలయ నిర్వాహక కమిటీ పెద్దలు, సభ్యులు వేడుకల ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే, పురుషవాక్కం ఏకాంబరేశ్వర స్వామి ఆలయం వద్ద ఉన్న పుట్టల్లో పాలు పోసి పూజలు చేశారు.





నాగదేవత విగ్రహాన్ని పూలతో అలంకరిస్తున్న భక్తులు - రామ్‌నగర్‌లోని నాగ దేవత ఆలయంలో సిద్ధం చేసిన క్షీరకలశాలు

రూ.50 కోట్లతో గ్రంథాలయాల అభివృద్ధి

● మంత్రి పీకే.శేఖర్‌బాబు



రాయపురంలోని శాఖా గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియారాజన్ తదితరులు

చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై అభివృద్ధి పథకంలో భాగంగా రూ.50 కోట్ల వ్యయంతో 10 గ్రంథాలయాలను అభివృద్ధిపరచి, కో-వర్కింగ్ స్పేస్, విద్యాకేంద్రం నెలకొల్పనున్నట్లు సీఎండీఏ ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన తిరువికనగర్, ఎగ్మూరు, హార్బర్, రాయపురం, ఆర్కేనగర్, పెరంబూరు ప్రాంతాల్లోని గ్రంథాలయాలను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం అమలులో భాగంగా ప్రస్తుతం 28 పనులు పూర్తయ్యాయని, 25 పనులు కొత్తగా ప్రారంభించామని తెలిపారు. ప్రస్తుతం పది గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు రూ.20 కోట్ల మేర నిధులు కేటాయించామని, అదే విధంగా ఆ గ్రంథాలయాలను అనుసంధానం చేసేలా కో - వర్కింగ్ స్పేస్ ఏర్పాటు చేసేందుకు రూ.30 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. మంత్రితోపాటు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియారాజన్, తిరువిక నగర్ ఎమ్మెల్యే తాయగం రవి, రాయపురం ఎమ్మెల్యే ఐడ్రీమ్ మూర్తి, ఆర్కేనగర్ ఎమ్మెల్యే జేజే ఎబినేజర్, పెరంబూరు ఎమ్మెల్యే ఆర్డీ శేఖర్, సీఎండీఏ మెంబర్ సెక్రటరీ అన్సుల్ మిశ్రా తదితర అధికారులు పర్యటించారు.

జలవనరుల శాఖ పథకాలపై సమీక్ష



చెన్నై సచివాలయంలో జలవనరుల శాఖ అమలు చేస్తున్న పథకాలపై అధికారులు, ఇంజినీర్లతో సమీక్ష జరుపుతున్న ఆ శాఖ మంత్రి దురైమురుగన్

ఎస్ఆర్ఐహెచ్ఈఆర్‌లో ఇంక్యుబేషన్ సెంటర్



అడయార్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీరామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటరు (ఎస్ఆర్ఐహెచ్ఈఆర్)లో వాతావరణ మార్పులపై ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటుచేయగా, దీనిని అనోవా వ్యవస్థాపకుడు చంద్రశేఖర్ కుప్పేరి తాజాగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాతావరణంలో చోటుచేసుకునే మార్పులను పరిష్కరించడానికి ఈ సెంటర్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇండస్ట్రియల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఛైర్మన్ కె.భాస్కరన్ మాట్లాడుతూ, పరిశ్రమల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే విధానానికి ప్రాధాన్యత ఇస్తున్నాయని, భవిష్యత్‌లో వ్యర్థాలనేవి ఉండవన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు కలిసి 'వన్ హెల్త్ ఎక్స్‌పో' పేరుతో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఐహెచ్ఈఆర్ ప్రో వైస్ చాన్సెలర్ డాక్టర్ మహేశ్ వాకముడి, డీన్ (రీసెర్చ్) డాక్టర్ కల్పనా బాలకృష్ణన్, శ్రీ రామచంద్ర ఫ్యాకల్టీ ఆఫ్ పబ్లిక్ హెల్త్ హెచ్‌వోడీ డాక్టర్ ఎస్.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి తిరువణ్ణామలై కార్తీక దీపోత్సవాలు

● 13న మహాదీపం

వేళచ్చేరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిచెందిన తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో డిసెంబరు 1నుంచి కార్తీక దీపోత్సవాలు జరుగనున్నాయి. డిసెంబరు 1న నగర గ్రామ దేవత దుర్గఅమ్మన్ ఉత్సవం, 4న ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. 13న కొండ శిఖరంపై మహాదీపం వెలిగించనున్నారు. 11 రోజులు మహాదీపం వెలిగించేందుకు 3,500 కిలోల నెయ్యి వినియోగించనున్నారు. ఈ నెయ్యి విరాళంగాను, నగదు రూపంలో భక్తులు చెల్లించే ప్రక్రియను సోమవారం జిల్లా కలెక్టర్ భాస్కర పాండ్యన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నెయ్యి కానుకగా అందించే భక్తులు ఆన్‌లైన్ ద్వారా, ఆలయంలో ఏర్పాటుచేసిన కౌంటర్ల ద్వారా చెల్లించవచ్చన్నారు. అలాగే, నెయ్యికి బదులుగా నగదును భక్తులు కిలో నెయ్యికి రూ.250, అరకిలోకు రూ.150, పావు కిలోకి రూ.80 చొప్పున కౌంటర్లలో చెల్లించాలని తెలిపారు. మహాదీపం రోజున కొండ పైకి 2,000 మంది భక్తులను మాత్రమే అనుమతించనున్నామని, వైద్యపరీక్షల అనంతరమే కొండ పైకి అనుమతించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

మెట్రోరైలు ప్రాజెక్టుకు కార్మికుల కొరత

● నత్తనడకగా సాగుతున్న పనులు



చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు పనులకు కార్మికుల కొరత ఏర్పడటంతో గత నాలుగైదు నెలలుగా ఆ రైలు మార్గం నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పదేపదే చేసిన విజ్ఞప్తి మేరకు రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసేందుకు కేంద్ర మంత్రి వర్గం ఇటీవలే అంగీకరించింది. త్వరలో ఆ నిధులు విడుదల కానుండటంతో మెట్రోరైలు నిర్మాణ పనులు వేగవంతం అవుతాయని అందరూ భావించారు. అయితే ప్రస్తుతం రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు కొత్త సమస్య ఎదుర్కొంటోంది. నగరంలో ప్రస్తుతం రెండు మార్గాల్లో నడుపుతున్న మెట్రోరైళ్లకు ఆదరణ పెరిగింది. నగరవాసులు ఎక్కువగా మెట్రోరైళ్లలో ప్రయాణించేందుకు ఆసక్తికనబరుస్తున్నారు. దీంతో రెండో దశ మెట్రోరైలు మార్గం పనులు కూడా ఊపందుకున్నాయి. ప్రస్తుతం మాధవరం - సిరుచేరి సిప్కాట్, పూందమల్లి - లైట్‌హౌస్, మాధవరం - చోళింగనల్లూరు ఇలా మూడు మార్గాల్లో 116.1 కి.మీ. మేర రెండో దశ మెట్రో మార్గం పనులు జరుగుతున్నాయి. తొలుత రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో రెండో దశ మెట్రోరైలు మార్గ నిర్మాణ పనులు చురుకుగా సాగాయి. ఈ పథకం అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తన వంతు వాటా నిధులను విడుదల చేయడంలో జాప్యం జరిగింది. ముఖ్యమంత్రి స్టాలిన్ ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీని కలిసి రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టుకు నిధులు విడుదల చేయాలని కోరుతూ వినతిపత్రం కూడా సమర్పించారు. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో నిర్మాణ పనులు వేగవంతమవుతాయని ఎదురుచూశారు. రూ.63,246 కోట్లతో చేపడుతున్న చెన్నై మెట్రో రెండో దశ ప్రాజెక్టు పనులకు అవసరమైన కార్మికులు అందుబాటులో లేకపోవడంతో పనులు నెమ్మదిగా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ పనులకు 40 శాతం వరకు కార్మికులు కొరత ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ మెట్రోరైలు మార్గం నిర్మాణ పనులు ఈ యేడాది ఫిబ్రవరి వరకూ కార్మికుల కొరత లేకుండా సాఫీగా జరిగాయి. ఈ పనులకు వచ్చే కార్మికులందరూ బిహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందినవారు. రెండేళ్లుగా రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు నిర్మాణపనులు ఈ కార్మికులే చేసేవారు. గత ఏప్రిల్‌లో లోక్‌సభ ఎన్నికలు జరుగటంతో ఈ కార్మికులలో ముప్పావు శాతం మంది తమ స్వరాష్ట్రాలకు వెళ్లారు. ఆ సమయంలోనే తొలిసారిగా మెట్రోరైలు నిర్మాణ పనులకు కార్మికుల కొరత ఏర్పడింది. స్వరాష్ట్రాలకు వెళ్ళిన కార్మికులంతా మే లేదా జూన్ నెలాఖరులోగా తిరిగి వస్తారని మెట్రోరైలు ప్రాజెక్టు కాంట్రాక్టర్లంతా ఎదురు చూశారు. అయితే స్వస్థలాలకు వెళ్ళిన కార్మికుల్లో చాలామంది అక్టోబర్ నెలాఖరు వరకూ తిరిగి రాలేదు. ఈ విషయం తెలుసుకున్న సీఎంఆర్ఎల్ అధికారులు సొంతూళ్లకు వెళ్ళిన కార్మికులను తిరిగి రప్పించమంటూ కాంట్రాక్టర్లకు సూచించారు. కాంట్రాక్టర్లు ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్ళి స్వయంగా కార్మికులను కలిసి చెన్నై రమ్మని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు సుమారు వంద మంది కార్మికులు మాత్రమే తిరిగొచ్చారు. ఈ విషయమై సీఎంఆర్ఎల్ అధికారులు మాట్లాడుతూ కార్మికుల కొరత తీవ్రరూపం దాల్చినప్పుడే కొంతమంది కాంట్రాక్టర్లు విమానాల్లో కార్మికులను నగరానికి రప్పించారన్నారు. మరికొంతమంది కాంట్రాక్టర్లు రైళ్ల ద్వారా కార్మికులను తీసుకొచ్చారని, అయితే ఇప్పటికీ సుమారు 40 శాతం మేర కార్మికుల కొరత ఉందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో కారిడార్ -4లో ఉన్న పూందమల్లి - పోరూరు మార్గాన్ని వీలైనంత త్వరగా ఉపయోగంలోకి తీసుకురావాలన్నదే తమ ఆశయమన్నారు. ఆ పనుల కోసం అవసరమైనంత మేరకు కార్మికులను తరలించినట్లు చెప్పారు. ఈ పరిస్థితుల్లో ప్రణాళిక ప్రకారం వచ్చే యేడాది ఈ పనులన్నీ పూర్తి కావటం ప్రశ్నార్థకమేనన్నారు. ఇదే విధంగా కారిడార్ 5లో ఎత్తు పెంచిన ప్రాంతంలో పనులు చేయడానికి కూడా కార్మికుల కొరత ఉందని తెలిపారు. సాధారణంగా మెట్రో రైలు సొరంగ మార్గం పనులకు తక్కువ మంది కార్మికులుంటే చాలని, అయితే భూ ఉపరితలంపై స్థంభాల రైలు మార్గం నిర్మించడానికే కార్మికులు ఎక్కువ సంఖ్యలో అవసరమన్నారు. ఈ రెండో దశ మెట్రోరైలు ప్రాజెక్టు పనుల్లో పాల్గొన్న కార్మికులలో చాలామంది ప్రస్తుతం ఉత్తరాది రాష్ట్రాల్లో జరుగుతున్న మెట్రోరైలు ప్రాజెక్టు పనులకు వెళ్ళిపోయారు. ఆ ప్రాజెక్టు పనులు జరిగే ప్రాంతాలన్నీ వారి స్వస్థలాలకు దగ్గరగా ఉండటం వల్లే ఆ కార్మికులు చెన్నై మెట్రోరైలు పనులకు మళ్ళీ తిరిగి రావటంలేదని తెలిపారు. ప్రస్తుతం బిహార్, చత్తీస్‌ఘడ్ తదితర ఉత్తరాది రాష్ట్రాల నుంచి కొత్తవారిని తీసుకువచ్చేందుకు కూడా కాంట్రాక్టర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. వీలైనంత త్వరగా రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి అనువుగా కార్మికుల సంఖ్యను పెంచేందుకు కూడా ప్రయత్నిస్తున్నారు.





తిరుమల రెండో ఘాట్‌రోడ్డు పక్కన ఉన్న ఖాళీ మద్యం సీసాలు, సిగరెట్, గుట్కా ప్యాకెట్లు



ఇదేంది స్వామి!

తిరుమలకు మద్యం, మాంసం, పొగాకు ఉత్పత్తులైన సిగరెట్, బీడీ, గుట్కా, హన్స్ వంటివి నిషేధం. వీటిని అలిపిరి భద్రత తనిఖీల్లోనే గుర్తించి అడ్డుకోవాలి. కానీ భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంతో తరచూ తిరుమలకు నిషేధిత వస్తువులు వస్తూనే ఉన్నాయి. ఈక్రమంలోనే తిరుమలకు వెళ్లే రెండో ఘాట్ రోడ్డులో వినాయక స్వామి ఆలయం దాటాక వచ్చే షెడ్డుకు సమీపంలో ఇలా తాగి పడేసిన మద్యం సీసాలు, వాడేసిన గుట్కా, హన్స్, సిగరెట్ ప్యాకెట్లు భారీగా పడున్నాయి. ఒకే ప్రాంతంలో పోగేసినట్టుగా ఉన్న వీటిని చూసి భక్తులు విస్మయం చెందుతున్నారు. భక్తుల సమాచారంతో విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పెద్దశేషవాహనంపై మలయప్ప

నాగుల చవితి సందర్భంగా మంగళవారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు మలయప్ప స్వామి పెద్దశేష వాహనంపై మాడవీధుల్లో ఊరేగారు. విశేష అలంకరణలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




అమానవీయ రాజకీయం

బాలికపై అత్యాచారం అంటూ నానా యాగీ

పరామర్శల పేరుతో హడావుడి ● వైసీపీ నేతల తీరుపై జనంలో ఆగ్రహం

ఎన్నికల్లో ఘోరంగా అధికారం కోల్పోయిన జగన్ పార్టీ అత్యాచార రాజకీయాలకు తెర లేపింది. ఎర్రావారిపాళెం మండలంలో సోమవారం రాత్రి జరిగిన ఒక సంఘటనపై నానా యాగీ చేసింది. నిజానిజాలు తెలుసుకోకుండా 14 ఏళ్ల బాలిక భవిష్యత్తును రచ్చకెక్కించేందుకు తెగబడింది. తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించే పేరుతో నాయకులంతా క్యూకట్టారు. హడావుడి చేశారు. చంద్రబాబు ప్రభుత్వం విఫలమైపోయిందంటూ వీరంగాలు వేశారు. చివరికి పదో తరగతి చదువుతున్న బాలిక తండ్రి చేతులు జోడించి..' నా బిడ్డమీద ఎటువంటి అత్యాచారం జరగలేదు. నా బిడ్డ భవిష్యత్తును పాడు చేయద్దు స్వాములాలా' అని కన్నీటితో వేడుకోవాల్సి వచ్చింది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి



నా బిడ్డపై ఎటువంటి అత్యాచారం జరగలేదు. గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వేధింపులకు మాత్రమే పాల్పడ్డారు. అయితే మీడియాలో, కొందరు రాజకీయ నేతలూ నా బిడ్డపై అత్యాచారం జరిగిందని తప్పుడు ప్రచారాలు చేస్తూ మా పరువు తీస్తున్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా నా బిడ్డ భవిష్యత్తును నాశనం చేయకండి.

- బాలిక తండ్రి



అత్యాచారం అబద్ధం: ఎస్పీ

14 ఏళ్ల విద్యార్థినిపై ఎటువంటి అత్యాచారం జరగలేదని వైద్య పరీక్షల్లో వైద్యులు స్పష్టంగా నిర్ధారించారు. పాఠశాల నుంచి వస్తున్న విద్యార్థినిని ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి అడ్డుకొని ప్రేమించాలని వేధింపులకు పాల్పడ్డారు. కొన్ని పత్రికల్లో రాసినట్లు, కొందరు నేతలు పేర్కొంటున్నట్లు బాలికపై ఎటువంటి అత్యాచారం జరగలేదు. ఇటువంటి సున్నితమైన విషయాల గురించి మాట్లాడే ముందు నిజనిజాలు పూర్తిగా తెలుసుకోవాలి. మీడియా కూడా ఎలాంటి ఆధారాలు, అధికారుల వివరణ లేకుండా అసత్యాలు ప్రసారం చేయడం మంచిది కాదు.బాలికను వేధింపులకు గురిచేసిన వారిని తప్పక అదుపులోకి తీసుకొని తగు చర్యలు చేపడతాం.

- సుబ్బారాయుడు, జిల్లా ఎస్పీ



మీకు మానవత్వం లేదా: పులివర్తి నాని

కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలికను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, వైసీపీ నేతల తీరును దుయ్యబట్టారు. పబ్లిసిటీ కోసం వైసీపీ సోషల్ మీడియాతో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మానవత్వం లేకుండా మైనర్ బాలిక విషయంలో అసత్యాలను ప్రచారం చేయించారని ఆరోపించారు. ఉదయం నుంచి సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాన్, మంత్రి లోకేష్ ఫోన్ చేస్తూ ఎప్పటికప్పుడు బాలిక పరిస్థితి, వివరాలను అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన ప్రతీ ఒక్కరిపై తప్పక చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామన్నారు.

ఆస్పత్రి వద్ద వైసీపీ నేతల హల్‌చల్

ప్రసూతి ఆసుపత్రికి ఉదయమే పులివర్తి సుధారెడ్డి చేరుకొని మధ్యాహ్నం వరకు అక్కడే ఉండి బాలికను పరామర్శించి, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు భూమన అభినయ్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిలు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. వీరిని పోలీసులు ఆస్పత్రిలోకి అనుమతించకుండా అడ్డుకున్నారు. సాధారణంగా మగవారిని ప్రసూతి ఆస్పత్రిలోకి అనుమతించరు. అయితే వారు దీంతో వారు ఆస్పత్రి ముందు బైటాయించారు. బాలికను పరామర్శించి ఆస్పత్రి నుంచి బయటకు వచ్చిన మాజీ మంత్రి రోజా తన సహజ ధోరణిలో ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలకు, బాలికలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు.



ప్రసూతి ఆస్పత్రి ముందు బైఠాయించిన వైసీపీ నేతలు, మీడియాతో మాట్లాడుతున్న రోజా

కస్తూర్బా గాంధీ పాఠశాలలో సీటు కేటాయింపు

తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి: యర్రావారిపాళెం మండలంలో దాడికి గురైన బాలిక.. తదుపరి విద్యను కొనసాగించేందుకు అక్కడి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సీటు కేటాయించినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమె చదువు కొనసాగించడానికి తగిన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.



ఎట్టకేలకు పట్టుబడిన సీఎస్‌డీటీ విష్ణు

పుత్తూరు కోర్టులో హాజరు పరిచిన పోలీసులు

రేషన్ బియ్యం అక్రమాల్లో కడప, నగరి, ఏర్పేడు బియ్యం వ్యాపారుల భాగస్వామ్యం

మరో పౌరసరఫరాల శాఖ అధికారి కూడా

5,040 బస్తాల అమ్మకంతో రూ.29.70 లక్షల ఆర్జన

పుత్తూరు అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పుత్తూరు పౌరసరఫరాల శాఖ గోదాములో రేషన్ బియ్యం అక్రమంగా తరలించిన సీఎస్‌డీటీ సీహెచ్ విష్ణు ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డాడు. సోమవారం పట్టుబడిన ఇతడిని మంగళవారం రిమాండ్ నిమిత్తం పుత్తూరులోని ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. పుత్తూరు ఎస్డీపీవో రవికుమార్ పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించనున్నట్లు సీఐ కె.వి.సురేంద్రనాయుడు తెలిపారు. పుత్తూరు, పిచ్చాటూరు పౌరసరఫరాల శాఖ మండల లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్లలో సీఎస్‌డీటీగా సీహెచ్ విష్ణు 2022 డిసెంబరు నుంచి 2024 ఆగస్టు వరకు విధులు నిర్వహించాడన్నారు. గోడౌన్ల నుంచి సుమారు 4,056 రేషన్ బియ్యం బస్తాలను అక్రమంగా విక్రయించినట్లు గుర్తించామన్నారు. ఉద్యోగ బాధ్యతలను విస్మరించి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టాడనే నేరారోపణలపై అరెస్టు చేశామన్నారు. ఆహార భద్రతా చట్టం -1955 అండర్ సెక్షన్ 314, 316, 316(5), 318(4), 7(1) కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమాల్లో బియ్యం వ్యాపారుల భాగస్వామ్యం

రేషన్ బియ్యం అక్రమాల్లో కడప, నగరి, ఏర్పేడుకు చెందిన కొందరు బియ్యం వ్యాపారులతో పాటు పౌరసరఫరాల శాఖకు చెందిన మరో అధికారి భాగస్వామ్యం ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను నియమించారు. వీరిని అదుపులోకి తీసుకుని విచారిస్తే మరిన్ని వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. పుత్తూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి 2,840 బియ్యం బస్తాలు విక్రయించి రూ.14.90 లక్షలు, పిచ్చాటూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి 2,200 బస్తాలు విక్రయించి రూ.14.80 లక్షలు అక్రమంగా ఆర్జించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

అప్పులకు.. విలాసాలకు..

ఈ అక్రమ సంపాదనను సీఎస్‌డీటీ విష్ణు తాను చేసిన అప్పులకు గాను నెల్లూరుకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డికి రూ.14 లక్షలు, పాపిరెడ్డికి రూ.1.50 లక్షలు, గూడూరుకు చెందిన రమణరాజుకు రూ.1.50 లక్షలు, చెన్నైకి చెందిన మరి కొందరి నగదు రూపంలో చెల్లించినట్లు పోలీసుల విచారణలో ఒప్పుకొన్నట్లు తెలిసింది. ఇక, విలాసాలకు ఖర్చు చేసిన మొత్తం ఎంతనేది లెక్క తేలలేదని పోలీసులు అంటున్నారు. నెల్లూరు జిల్లా కలువాయి మండలంలోని తన సొంతూరు రాజుపాళెంలో ఒక ఇల్లు, రెండు రేకుల షెడ్లు, బైక్ ఉందని, తన తల్లి పేరున ఎకరా మామిడి తోట ఉన్నట్టు విచారణలో విష్ణు చెప్పినట్లు సమాచారం.

కత్తితో ఆటో డ్రైవరు వీరంగం

స్నేహితుడి కుటుంబంపై దాడితో ముగ్గురికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తిలో కలకలం



చికిత్స పొందుతున్న సతీష్, గణేష్



చికిత్స పొందుతున్న కీర్తన

శ్రీకాళహస్తి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్ కత్తితో విచక్షణా రహితంగా రెచ్చిపోయాడు. వేకువ జామున 4 గంటల సమయంలో స్నేహితుడి ఇంటికెళ్లి హత్యాయత్నానికి తెగబడ్డాడు. అడ్డుకున్న అతడి భార్య, మామనూ గాయపరిచాడు. రక్తం కారుతుండగా ముగ్గురూ పోలీసు స్టేషనుకు పరుగు తీశారు. తెల్లారేసరికి పట్టణ ప్రధాన రహదారిలో కనిపించిన రక్తపు మరకలతో శ్రీకాళహస్తిలో కలకలం రేగింది.

పట్టణంలోని జెట్టిపాళేనికి చెందిన సతీష్, ముత్యాలమ్మ గుడి వీధికి చెందిన మణి ఆటో డ్రైవర్లు. వీరిద్దరూ స్నేహితులు. మద్యంమత్తులో తరచూ వాగ్వాదం చోటు చేసుకునేది. సోమవారం రాత్రి ముత్యాలమ్మ గుడి వీధిలో మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఈ క్రమంలో మంగళవారం వేకువన నాలుగున్నర గంటల సమయంలో కత్తి చేత పట్టుకున్న మణి.. జెట్టిపాళెంలోని సతీష్ ఇంటికెళ్లి తలుపు కొట్టాడు. వెలుపలకు వచ్చిన సతీష్‌పై కత్తితో దాడి చేశాడు. అరుపులు విన్న కీర్తన.. తన భర్తను కాపాడుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో ఆమెపైనా నిందితుడు కత్తితో దాడి చేశాడు. కీర్తన తండ్రి గణేష్ వచ్చి మణిని అదుపు చేసేందుకు ప్రయత్నించగా, అతడిపైనా దాడి చేశాడు. దీంతో రక్తం కారుతుండా ముగ్గురూ జెట్టిపాళెం నుంచి పెళ్లి మండపం మీదుగా వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు పరుగుతీశారు. వెంటనే వీరిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సతీష్‌కు పొట్ట పైన, కీర్తనకు నడుము కింద, గణేష్‌కు చేతిపైన కత్తిపోట్లతో గాయాలైనట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఈ ఘటనపై శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న మణి కోసం గాలిస్తున్నారు. బాధితులు పరుగు తీసిన రోడ్డంతా రక్తపు మరకలయ్యాయి.

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి ఘన స్వాగతం



బీఆర్ నాయుడికి స్వాగతం పలుకుతూ తిరుపతిలో భారీగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

తిరుపతిరూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడు ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లాకు వచ్చిన నేపథ్యంలో అభిమానులు వినూత్నరీతిలో స్వాగతం పలికారు. రాజమండ్రికి చెందిన ఆయనకు కోనేరు మురళి, తూర్పు గోదావరి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కురుకూరి కిషోర్ నేతృత్వంలో రేణిగుంట విమానాశ్రయం నుంచి అలిపిరివరకు.. అక్కడ్నుంచి ఆయన ఇంటి వరకు దారిపొడవునా పెద్దఎత్తున్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి సాదర స్వాగతం పలికారు. అలాగే, తిరుపతిలోని ఆయన నివాసం వరకూ ఫ్లెక్సీలు, బ్యానర్లను కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు.



బ్రెస్ట్ క్యాన్సర్ హెల్ప్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి



తిరుపతి కలెక్టరేట్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యసంరక్షణ కోసం బ్రెస్ట్ క్యాన్సర్ హెల్ప్ యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని తద్వారా మరింత అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మహిళలలో బ్రెస్ట్ క్యాన్సర్ నివారణకు సంబంధించి స్వీయ పరీక్ష పోస్టర్‌ని మంగళవారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశాఖ, పరివర్తన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారు స్వీయ పరీక్ష చేసుకుని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచిత పరీక్షలతోపాటు చికిత్స పొందాలని తెలిపారు. సిహాయ్, పరివర్తన సంస్థల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా దీనిపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు సాయి ధరమ్‌తేజ్

తిరుమల, నవంబరు5(ఆంధ్రజ్యోతి): సినీ హీరో సాయి ధరమ్‌తేజ్ మంగళవారం రాత్రి 11 గంటలకు తిరుమలకు వచ్చారు. అలిపిరి నుంచి కాలినడకను వచ్చిన ఆయనకు జీఎన్సీ వద్ద స్థానిక అభిమానులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఫీనిక్స్ అతిథి గృహానికి చేరుకుని రాత్రి బస చేశారు. బుధవారం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

బీఈ, బీఎస్సీ గ్రాడ్యుయేట్లకు సెమీకండక్టర్‌పై శిక్షణ

వేళచ్చేరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ మద్రాసు ప్రవర్తక్ టెక్నాలజీస్ ఫౌండేషన్ ఇంజనీరింగ్, సైన్స్ గ్రాడ్యుయేట్లకు స్వల్పకాలిక సెమీకండక్టర్ శిక్షణ అందించనుంది. ఈ మేరకు ఐఐటీ మద్రాసు విడుదల చేసిన ప్రకటనలో... ఇంజనీరింగ్, సైన్స్ గ్రాడ్యుయేట్లు, ఇంజనీరింగ్ డిప్లొమా హోల్డర్లు, ఎలక్ట్రానిక్స్ నేపథ్యం ఉన్న గ్రాడ్యుయేట్లు, ప్రస్తుత విద్యార్థులు కూడా ఈ శిక్షణలో చేరవచ్చు, ఐఐటీ ప్రాంగణంలో శిక్షణ కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. సెమీ కండక్టర్ పరిశ్రమ గురించి వివరించడంతో పాటు ప్రాక్టికల్స్ కూడా చేయించనున్నారు. ఒక రోజు ఫీజుగా రూ.650 వసూలుచేయనున్నారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ఉపాధి కూడా కల్పించనున్నారు. ఈ నెల 9 నుంచి 17వ తేది వరకు తొలివిడత శిక్షణ, 25 నుంచి డిసెంబరు 3వ తేది వరకు రెండవ విడత, డిసెంబరు 9 నుంచి 17వ తేది వరకు మూడో విడత శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో చేరగోరువారు https://iitmpravartak. org. in/cees_course అనే లింక్‌ను వినియోగించి పేరు నమోదు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 9498341969 అనే నెంబరు సంప్రదించవచ్చు.

గంజాయి స్వాధీనం కేసులో 12 మంది ఇంజనీరింగ్ విద్యార్థుల అరెస్టు

చెన్నై, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేజే నగర్ ప్రాంతంలో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి 12 మంది ఇంజనీరింగ్ విద్యార్థుల నుంచి గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తుమాత్రలను స్వాధీనం చేసుకున్నారు. జేజే నగర్ పారిరోడ్డులో మత్తునిచ్చే స్టాంపులతో సంచరిస్తున్న కార్తికేయన్ అనే విద్యార్థిని పోలీసులు నిర్బంధించారు. అతడిచ్చిన సమాచారం మేరకు మత్తు మందులు విక్రయిస్తున్న మందవెల్లికి చెందిన అరవింద్ బాలాజీ, మరైమలర్‌నగర్ ఆరుణి, త్రిషణ్‌సంపత్, గూడువాంజేరికి చెందిన వత్సల్‌ని అరెస్టు చేశారు.

తిరుమలకు వస్తే పాజిటివ్ ఫీలింగ్



అనన్య నాగళ్ల

తిరుమల, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు ఎప్పుడు వచ్చినా మంచి పాజిటివ్ ఫీలింగ్ వస్తుందని సినీనటి అనన్య నాగళ్ల అన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'పొట్టేల్' చిత్రం తనకు మంచి పేరు తీసుకొచ్చిందన్నారు. త్వరలో మంచి ప్రాజెక్టులు చేయనున్న క్రమంలో స్వామి ఆశీస్సుల కోసం వచ్చానన్నారు.



ఎనిమిది అడుగుల జెర్రిపోతు

తిరుమల, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): తిరుమల జీఎన్సీ గార్డెన్‌లోని ఓ గదిలోకి మంగళవారం సుమారు ఎనిమిది అడుగుల జెర్రిపోతు చొరబడింది. పామును గుర్తించిన గార్డెన్ సిబ్బంది వెంటనే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడుకి సమాచారమిచ్చారు. ఆయన పామును పట్టుకోవడంతో అక్కడివారు ఊపిరిపీల్చుకున్నారు. అలాగే రింగురోడ్డులోని డ్రైనేజ్ వాటర్ ప్లాంట్ వద్ద మరో నాలుగు అడుగుల పొడవైన నాగుపామును కూడా భాస్కర్ పట్టుకున్నారు. ఈ రెండింటినీ దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.